నిబంధనలకు నీళ్లు!

- పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్ ప్లాంట్లు
- వేసవిలో వీధికొకటి పుట్టుకొస్తున్న వైనం
- అందినకాడికి దోచుకుంటున్న నిర్వాహకులు
- నీటి శుద్ధిలో కనీస ప్రమాణాలూ కరవే
- కొరవడిన సంబంధిత అధికారుల పర్యవేక్షణ



ప్రజలు మినరల్ వాటర్ తాగేందుకు అలవాటు పడ్డారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కృష్ణా నది నీటిని శుద్ధపరిచి సరఫరా చేస్తున్నా ఆ నీటిని ఇంటి అవసరాలకు మాత్రమే వాడుతున్నారు. తాగునీటిని ప్లాంట్లలో క్యాన్ల ద్వారా కొనుగోలు చేసి తాగుతున్నారు. ఇదే అదనుగా ప్లాంట్ల పేరుతో సరఫరా చేస్తున్న నీటిని నిబంధనల ప్రకారం శుద్ధిచేసి విక్రయించేవారు అతి తక్కువగా ఉంటున్నారు. దీంతో వాటర్ ప్లాంట్ల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తోంది.

క్యానుల్లో నీరు నింపుతున్న దృశ్యం

మంగళగిరి : వేసవి కాలం కావడంతో తాగునీటికి డిమాండ్ బాగా పెరిగింది. దీంతో వీధికో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు అవుతోంది. చాలామంది పెద్ద స్టీల్ క్యాను కొనుగోలు చేసి దానిలో కూలింగ్ వాటర్ నింపి విక్రయిస్తున్నారు. నగర పరిధిలోని ఎన్ని మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయో కార్పొరేషన్ అధికారుల వద్ద కూడా లెక్కలు లేకపోవడం గమనార్హం. అనధికారికంగా కార్పొరేషన్ పరిధిలో 140కుపైగా ప్లాంట్లు నడుస్తున్నాయి. వీటిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వాహకులు ఆదరికొరగా శుద్ధి చేసిన నీటినే మినరల్ వాటర్ పేరుతో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నీటిలో రుచి కోసం విచ్చలవిడిగా రసాయనాలను కలుపుతూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ప్రజల అమాయకత్వం, అధికారుల నిర్లక్ష్యం వెరసి ప్లాంట్ల నిర్వాహకులకు కాసులు కురిపిస్తున్నాయి.

వేసవి రాగానే ఎక్కువ ఏర్పాటు

జీవన శైలిలో మార్పుల కారణంగా ఆరోగ్యంపై నానాటికీ శ్రద్ధ పెరుగుతోంది. ఈ కారణంగా ప్రతి ఒక్కరు మినరల్ వాటర్ తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వేసవి కాలంలో మాత్రమే మూడు నెలలు తాగునీటిని విక్రయించేందుకు కొత్తగా ప్లాంట్లు ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. చాలాచోట్ల రూ.20 వేల ఖర్చుతో పెద్ద స్టీల్ క్యాను, పది వాటర్ క్యాన్లతో తాగునీటి వ్యాపారం చేస్తుండటం విశేషం. సాధారణంగా ప్రజలకు శుద్ధి చేసిన నీటిని విక్రయించాలంటే తప్పనిసరిగా ఐఎస్ఐ అనుమతి పొందాలి. ఇందుకోసం నీటి శుద్ధి కేంద్రాలలో రసాయన, సూక్ష్మజీవుల సంబంధించిన ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలి. ఎప్పటికప్పుడు నీటిని శుద్ధి చేసే ముందు, చేసిన తర్వాత విధిగా నిపుణుల చేత పరీక్షలు చేయించి నివేదికలు రూపొందించాలి. ఈ నివేదికలను ఐఎస్ఐ సిబ్బంది పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉంటే నీటి వ్యాపారాన్ని అనుమతిస్తారు. ఐఎస్ఐ జారీగిన తర్వాతే నీటిని క్యాన్లు, సీసాలలో నింపి విక్రయం చాలి. ఆదే సమయంలో క్యాన్లపై కంపెనీ పేరు, తయారైన తేదీ, ఎప్పటిలోగా వినియోగించాలి తదితర వివరాలను స్పష్టంగా ముద్రించాలి.

అరకొరగా శుద్ధి

నగర పాలక సంస్థలో మాత్రం దాదాపు అన్ని ప్లాంట్లలో ఎలాంటి ల్యాబ్లు లేవు. ప్రభుత్వ నిబంధనల మేరకు ల్యాబ్ ఏర్పాటు నిర్వహణకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుంది. దీంతో వీటిని ఏర్పాటు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. మినరల్ వాటర్ పేరుతో నీటిని సాధారణ ఆర్వో (రివర్స్ ఆస్మోసిస్) ప్రక్రియ ద్వారా అరకొరగా శుద్ధి చేసి విక్రయిస్తున్నారు. నీటిని నింపే క్యాన్లను కూడా సరిగా శుభ్రం చేయడం లేదు. ఇలాంటి క్యాన్లలో నీటిని దుకాణాలు, గృహావసరాలకు ఆటోల ద్వారా తరలించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న ఈ ప్లాంట్లను తరచూ తనిఖీ చేయాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇకనైనా అధికారులు స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కూలింగ్ వాటర్ క్యాన్లు

తనిఖీలు చేపడతాం



మినరల్ వాటర్ ప్లాంట్లలో తనిఖీలు నిర్వహిస్తాం. నిబంధనలు పాటించకపోతే తగిన చర్యలు తీసుకుంటాం. ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే వెంటనే విచారణ చేపట్టనున్నాం. నిబంధనల ప్రకారం లేని వాటర్ ప్లాంట్లను సీజ్ చేయడంతోపాటు నిర్వాహకులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– అలీంబాషా, ఎంటీఎంసీ కమిషనర్

కఠిన చర్యలు తీసుకోవాలి



మినరల్ వాటర్ ప్లాంట్లపై అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా కూడా లేదు. వేసవి కాలంలో స్టీల్ క్యాన్లలో నీటిని కూలింగ్ చేసి విక్రయిస్తున్నారు. చాలాచోట్ల ప్లాంట్ల నిర్వాహకులు ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు. కనీసం శుభ్రం చేయకుండా నీటిని విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారు. మరోవైపు అందినకాడికి దోచుకుంటున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– వియ్యం శ్రీను, మంగళగిరి

క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



పెదవడ్లపూడి (మంగళగిరి): నగర పరిధిలోని పెదవడ్లపూడిలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. శుక్రవారం బాధితులు సాదా వెంకాయమ్మకు రూ.60 వేలు, మోపర్తి నాగేశ్వరరావుకు రూ. 37 వేలను అందించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ జువ్వాది కిరణ్ చంద, టీడీపీ నాయకులు బిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, యేట్ల శివరామయ్య, మాదల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన ముఖ్యం



ఆత్మకూరు (మంగళగిరి): కర్మాగారాలలో పనిచేసే కార్మికులు ఆకస్మాత్తుగా అగ్ని ప్రమాదం జరిగితే ఎలా స్పందించాలనే విషయంపై అవగాహన కలిగి ఉండాలని మంగళగిరి అగ్నిమాపక అధికారి వెంకటేశ్వర్లరెడ్డి తెలిపారు. అగ్నిప్రమాద వారోత్సవాల్లో భాగంగా నగర పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో ఉన్న కోకా కోలా కంపెనీలో శుక్రవారం కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైనా కర్మాగారంలో అగ్నిప్రమాదం బోటు చేసుకున్నప్పుడు ముందుగా కార్మికులకు ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారిని బయటకు తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించాలని పేర్కొన్నారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. ప్రమాద సమయంలో మంటలను అదుపులోకి తెచ్చేందుకు అవసరమైన సామగ్రిని నిబంధనల ప్రకారం అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

నైపుణ్యం పెంపునకు శిక్షణ తరగతులు



మంగళగిరి టౌన్: విద్యార్థుల్లో నైపుణ్యం పెంచుకునేందుకు ఎస్ఏపీ ఎన్డీ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని మానవ సేవా సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్ అన్నారు. మంగళగిరి పరిధిలోని సంస్థ ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన వారు, వివిధ రంగాల్లో ఉన్న నిపుణులు కోర్సు నేర్చుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. 3 నెలల పాటు ఈ కోర్సును ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. వారానికి రెండు రోజులు మాత్రమే తరగతులు ఉంటాయని తెలిపారు. సంస్థ ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును కొనసాగించాలి



తాడేపల్లి రూరల్: భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును ప్రభుత్వం కొనసాగించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ గౌరవ అధ్యక్షుడు సిహెచ్ భూజంగరావు కోరారు. శుక్రవారం మహానాడులో బి. చంద్రశేఖర్ అధ్యక్షతన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భుజంగరావు మాట్లాడుతూ.. కార్మికుల దీర్ఘకాల పోరాటం ఫలితంగా ఏర్పడిన సంక్షేమ బోర్డును కూటమి ప్రభుత్వం కొనసాగించాలన్నారు. రాజధాని నిర్మాణ పనుల్లో స్థానిక కార్మికులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోము, వెంకటేశ్వర్లు, సుధాకర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జన సేవాదళ్ వలంటీర్లకు శిక్షణ



చినకాకాని (మంగళగిరి): విపత్తుల వేళ జన సేవాదళ్ వలంటీర్లు ప్రజలకు అండగా నిలుస్తారని జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. నగర పరిధిలోని చినకాకానిలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దేశానికి మరోస్వాద ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఎదుర్కొనేందుకు జన సేవాదళ్ ఉపయోగపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, అన్నవరపు ప్రభాకర్, జాలాది జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఈ -వ్యర్థాల'పై అవగాహన

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరులో శనివారం 'ఈ -వ్యర్థాల'పై ప్రజలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ అలీంబాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందికి అందజేసి స్వచ్ఛ మంగళగిరికి ప్రజలు సహకరించాలని కోరారు. శనివారం ఉదయం ఆత్మకూరు అండర్ పాస్ సర్వీసు రోడ్డులో ప్రారంభమయ్యే స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని అంజిరెడ్డి కాలనీలో మైనర్పై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడికి కఠిన శిక్ష పడేలా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడిపై పోక్సో కింద కేసు నమోదు చేయాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

తాడికొండ: మండల పరిధిలోని రాయపూడిలో ఆక్రమంగా తరలిస్తున్న 30 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. తుళ్లూరులోని ప్రధాన రహదారిపై రేషన్ బియ్యం సంచులతో వెళుతున్న వాహనాన్ని తనిఖీ చేశారు. ఒక్కో బస్తాలో 45 కేజీల చొప్పున బియ్యం ఉన్నాయి. 30 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. వాహన చోదకుడితోపాటు బియ్యం బస్తాలను పోలీస్ స్టేషన్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు.

నేడు 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'

దుగ్గిరాల: ప్రతి నెల మూడో శనివారం జరిగే 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం ఈ నెల 19వ తేదీన దుగ్గిరాలలో ఉంటుందని ఇన్చార్జ్ ఎంపీడీఓ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో కార్యక్రమం జరుగుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

జంక్షన్లో మందుబాబుల వీరంగం

- భయభ్రాంతులకు గురవుతున్న మహిళలు
- పోలీసు అధికారులు స్పందించాలని డిమాండ్

మేడికొండూరు: పేరేచర్ల జంక్షన్లో మందు బాబుల వీరంగం సృష్టిస్తున్నారు. పట్టపగలే రహదారి పక్కనే మద్యం తాగి ఆటుగా వచ్చిపోయే మహిళలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. జంక్షన్ కావడంతో ఇక్కడ ఎక్కువ మంది బస్సులు ఎక్కుతూ, దిగుతూ ఉంటారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది నిత్యావసరాల కోసం వస్తుంటారు. ఈ ప్రాంతం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో మందుబాబులు ఆగడాలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఆదేమని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారు. పేరేచర్ల జంక్షన్ - నత్తెనపల్లి రోడ్డులోని రహదారి పక్కనే ఉన్న సోడా బండ్ల వద్ద మద్యం కలుపుకొని తాగుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే కుర్చీలపై కూర్చొని మద్యం తాగుతున్నారు. మీకు దాకా తాగి వికృత చేష్టలతో ప్రజలను నానా ఇబ్బందులు గురిచేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పేరేచర్ల గ్రామ వాసులు కోరుతున్నారు. రహదారి పక్కన ఉన్న తోపుడుబండ్లను తొలగించి ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా చూడాలంటున్నారు. ఈ నెల 11న ఒక హోటల్లో మందుబాబులు అల్పాహారం తిని డబ్బులు అడిగితే వ్యాపారిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. హోటల్ యజమాని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేశారు. ఇప్పటివరకు పోలీసులు చర్యలు తీసుకోలేదని బాధితుడు వాపోతున్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధన ముఖ్యం

తాడేపల్లి రూరల్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు సాధించాలని సాక్షి ఫ్లాలిని భారతీయ జనతా మజ్దూర్ సెల్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు షేక్ ఖలీషా తుల్లా బాషా అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణా కెనాల్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న ప్యాక్ కంపెనీ కాలనీలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు బందారు వెంకటరమణ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా షేక్ ఖలీషా తుల్లా బాషా మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ప్రధాని మోదీ ముందుకు తీసుకువెళుతున్నారని అన్నారు. అనంతరం కంపెనీ పూర్వ కార్మికులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఆ ప్రాంతంలో కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. మరుగుదొడ్డు కూడా లేవని, మహిళలు ఇబ్బంది పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాజా అలీ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

ఫిరంగిపురం: ప్రతి మానవుడు దైవ ప్రార్థనలు చేయడం ద్వారా సత్ ఫలితాలు పొందవచ్చని విచారణ గురువులు ఫాదిమా మర్రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదిమా మర్రెడ్డి వాక్యోపదేశం చేస్తూ ప్రజల పాపాలను ప్రక్షాళన చేసేందుకు భూమి మీద ఏసుక్రీస్తు అవతరించారని చెప్పారు. మరియు ఈ లోకానికి ఏసు క్రీస్తును అందించారని తెలిపారు. సాయంత్రం ప్రాంగణంలో శిలువ ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పరిశుద్ధాత్మ ఏసుక్రీస్తు నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో సహాయ విచారణ గురువులు, మఠ కన్యలు, గుడి పెద్దలు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.



ఫిరంగిపురం: ఏసు శిలువ ధారి ప్రదర్శన కార్యక్రమంలో క్రైస్తవులు



తాడికొండ: చర్చిలో సందేశాన్నిస్తున్న పాస్టర్ నల్లపు సుధాకర్

తాడికొండలో..

తాడికొండ: గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం తాడికొండ, తుళ్లూరు మండలాల్లో క్రైస్తవ సోదరులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు శిలువ మరణానికి సంబంధించి పలికిన 7 మాటల ప్రాధాన్యతపై పాస్టర్లు సందేశం అందించారు. గత 40 రోజులుగా క్రైస్తవ సోదరులు ఆచరించిన ఉపవాస ప్రార్థనలు శుక్రవారంతో ముగిశాయి. సాయంత్రం 3 గంటలకు అన్ని చర్చిలలో భక్తులకు పానీయాలు అందజేసి దీక్షలు విరమింపజేశారు. భక్తిశ్రద్ధల నడుమ ఆరాధనలో భక్తులు పాల్గొనడంతో చర్చిలు కిక్కిరిసిపోయాయి.

దుగ్గిరాలలో..

దుగ్గిరాల: భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు జరిగాయి. చిలువూరు, తుమ్మపూడి గ్రామాలలో శుక్రవారం పలు చర్చిలలో కార్యక్రమాలు నిర్వహించారు. చిలువూరు ఆర్సీఎం చర్చిలో ఉదయం ప్రార్థనలు జరిగాయి. సాయంత్రం 4 గంటల సమయంలో ఫాదర్ ఎం.సురేష్ ఆధ్వర్యంలో విశ్వాసులు గ్రామ వీధులలో క్రీస్తు శిలువ మోస్తూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

సులకపేటలో..

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సులకపేట ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే నిర్వహించారు. చర్చిలో విచారణ గురువులు ఫాదర్ డానియల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు మరణానికి సంబంధించిన ఘట్టాలను స్లీవ మార్గం ద్వారా ప్రకాష్ నగర్లోని ఆర్సీఎం దేవాలయం నుంచి ఆర్సీఎం దేవాలయం వరకు ప్రదర్శించారు. కార్యక్రమంలో విచారణ గురువులు పాపయ్య పాల్గొన్నారు.



దుగ్గిరాల: చిలువూరు గ్రామంలో క్రీస్తు శిలువ మోస్తున్నట్లు ప్రదర్శన



తాడేపల్లి రూరల్: క్రీస్తును శిలువ వేసే క్రమాన్ని ప్రదర్శిస్తున్న క్రైస్తవులు

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడనాడాలి

తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికుల నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కెన్నెడీన్, కె.ఆదినారాయణతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ.. కోర్టులు కూడా కార్మికులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చాయని గుర్తుచేశారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని ఇకనైనా నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో కె.మారుతీ, దుర్గమ్మ, సామాన్య, గురవయ్య, హగ్గయ్య, సుబ్బారావు, ఏడుకొండలు, శారద, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేముల దుర్గారావు

ఘనంగా ప్రపంచ వారసత్వ దినోత్సవం

తాడేపల్లి రూరల్: ఏ దేశం మూలాలను తెలుసుకోవాలన్నా సంస్కృతి, వారసత్వాలే మూలాధారమని నెల్లూరు జిల్లా డీఎస్పీ ఎస్వీ రమణ అన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'వికసిత భారత్ – భారతీయ వారసత్వం– సంస్కృతి'పై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్వీ రమణ మాట్లాడుతూ.. భారత దేశం గొప్పతనాన్ని ఈ దేశ పౌరులుగా తెలుసుకోవడం నేటి యువత బాధ్యత అన్నారు. పురావస్తు శాఖ, మ్యూజియం శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. స్వామి నాయక్ మాట్లాడుతూ.. దేశ సంస్కృతికి గుర్తుగా ఎన్నో కళాఖండాలు, శిల్పాలు, చిత్రలేఖనాలు, కట్టడాలు, ఆలయాలను ప్రభుత్వాలు రూ.వందల కోట్లతో పరిరక్షిస్తున్నాయని పేర్కొన్నారు. ఆంధ్ర లయోలా కళాశాల ప్రిన్సిపాల్ ఉప ఆచార్యులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలోని వివాహ, కుటుంబ, రాజకీయ, జానపద, నాట్య, నాటక, సంగీత, సంస్కృతులను వివరించారు. కేఎల్యూ బీఏ (ఐఏఎస్) విభాగ అధిపతి డాక్టర్ శివనాగయ్య మాట్లాడుతూ.. విద్యార్థులకు నిపుణతలతో సదస్సుల నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ పీఎంవీ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, విభాగ ఉప అధిపతి డాక్టర్ కె. అనిల్ కుమార్, డాక్టర్ అద్దంకి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీ రమణను సత్కరిస్తున్న డాక్టర్ శివనాగయ్య తదితరులు

కొనసాగుతున్న డ్రైవర్ల సమ్మె



మంగళగిరి టౌన్: నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఆప్కాస్లో చేర్చాలని డిమాండ్ చేశారు. 12 రోజులుగా సమ్మె జరుగుతున్నా అధికారులు కానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోలేదని విమర్శించారు. సమ్మె కొనసాగితే నగర పరిధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు శివ, కార్యదర్శి రవి, నాయకులు మోహన్, శ్రీకాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు కొంత ఉపశమనం

దుగ్గిరాల: వక్ఫ్ ఆస్తుల్లో ఎలాంటి మార్పులు చేయొద్దని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతో కోట్లాది ముస్లిం సమాజానికి కొంత ఉపశమనం కలిగించిందని దుగ్గిరాలలోని ముద్దుజానగర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్సీపీ మైనార్టీ విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ చట్ట సవరణ బిల్లులో అనేక లోపాలు ఉన్నాయని అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్సీపీ మొదటి నుంచి ఈ బిల్లును వ్యతిరేకించిందని గుర్తుచేశారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ హుస్సేన్, పఠాన్ మస్తాన్ వలీ, షేక్ జిలాని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సుభాని

కేంద్ర విధానాలను తిప్పికొట్టాలి

మంగళగిరి టౌన్: కార్మికులు ఐక్యంగా ఉండి కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. పోరాడి సాధించిన కార్మిక హక్కులను హరించేలా కేంద్ర విధానాలు ఉన్నాయని విమర్శించారు. జీటీఓల పెండింగ్ గ్రాంట్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మంగళగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం వెంటనే చేపట్టాలన్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని కోరారు. వేసవి కాలంలో తాగునీరు అందని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. మే ఒకటో తేదీన మే డే కార్యక్రమాన్ని వాడవాడలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు, నాయకులు జేవీ రాఘవులు, బాలకృష్ణ, వెంగయ్య, బాలాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాశం రామారావు

రతన్ టాటా విగ్రహం ఏర్పాటు సంతోషదాయకం

లాం(తాడికొండ): రతన్ టాటా విగ్రహాన్ని లాం లోటస్ ఇన్ఫ్రా ఆగ్రోఫెర్ వెంచర్లో ఏర్పాటు చేయడం సంతోషదాయకమని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు అన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్తో కలిసి శుక్రవారం విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. టాటా ట్రస్ట్ సీనియర్ మేనేజర్ కొనాలి రమ, నారెడ్కో గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ వంశీ, లోటస్ ఇన్ఫ్రా సంస్థ కొలిశెట్టి అంకారావు, నాగండ్ల రాంబాబు, బండే శ్రీనివాసరావు, వంశీకృష్ణ పాల్గొన్నారు.

